# చెలిమె



## నమస్తే తెలంగాణ

నిన్నటి నుంచి నేటిలోకి
నేటి నుంచి రేపటిలోకి
వజ్రోత్సవం వైపు
పరిగెడుతున్న రజతోత్సవం
దేశ విదేశాల్లో విజయకేతనం

విత్తు పంటకు వాగ్దానం చేసినట్టు
తెలంగాణ వాగ్దానంతో ఉద్యమం
స్వరాష్ట్రం పర్జన్య సమర శంఖం
అవిరళ కృషి చైతన్య సందేశాలు
సబ్బండులేకమై అలుపెరుగని పోరు
స్వేచ్ఛకు ఊపిరులు జూన్ రెండు

రాష్ట్ర సాధనతో
ముంగిళ్లలో నదుల పరుగులు
అడుగడుగు అలల హోరులై పల్లెల్లో ప్రగతి
సాధికారత సజ్జకంకులు మురిసిన కులవృత్తులు
దేశానికి మార్గం తెలంగాణకు గౌరవం

నడిచిన దారంతా పూల తేరేమి కాదు
సీతమ్మ శోకం బాలనాగమ్మలా నలిపేశారు
నేలంతా అంతస్థులై అణచేశారు
అహంకారంతో అవమానించారు
కారుణ్యం వట్టిపోయిన కాలాన ఉద్యమ సూరీడు

నిప్పులో కాలి చలిలో వణికి
ఎండలో ఎండిన మానవహారాలు
అనేకానేక ఉద్యమాలు, సమ్మెలు, సత్యాగ్రహాలు
అరెస్టులు, బలిదానాలు,
నేల నేలంతా నెత్తురు సాళ్లు
మలిదశ ఉద్యమ ప్రస్థానాలు సందేహాలు సవాళ్లు
కలాలు గళాలు మట్టి మనిషి,
తట్టా బుట్టా, పుట్టా పార
ఉద్యమ నెగళ్లయి

నాటి నుంచి... అగమాగం అయోమయం కుట్రలు
తిన్నింటి వాసాలు లెక్కపెట్టే హీనులు
కనిపెంచిన తల్లినంటే కాదు కాదు
పినతల్లివని కారుకూతలు
దివ్వెను చూసిన చక్షువు దుర్మార్గాన్ని వీక్షిస్తుంది
భారత స్వాతంత్ర్య త్యాగాలనూ విన్నాం
మలిదశ తెలంగాణ పోరాటంలో పాల్గొన్నాం

భయపెట్టిన సింగాలు మాటుగాసిన తోడేళ్లు
వెక్కిరించిన నక్కలు ఇంటి నుంచి గెంటేసిన
ఎలుగుబంట్లు విజయాన్ని కండ్లారా
చూసి ముడుచుకున్న తోకలు
సమైక్యవాదం చెల్లని నాణెం
జై తెలంగాణంటూ
ప్రజా పోరాటం తుది విజయం
తెలంగాణ కంటిలో కోటికాంతుల వెలుగులు
నమస్తే తెలంగాణ

(మలిదశ తెలంగాణ ఉద్యమం 25 ఏండ్ల సందర్భంగా...)



వనపట్ల సుబ్బయ్య
94927 65358

---

తెలంగాణ మలిదశ ఉద్యమ నేపథ్యంగా వచ్చిన సాహిత్య ప్రక్రియలలో కవిత్వం ముఖ్యమైన ప్రక్రియ. స్పష్టమైన సందేశంతో మార్పును తెలిపే 'ఆత్మగౌరవ' ప్రక్రియగా ముందుకుసాగింది. తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని జనానికి అర్థమయ్యే విధంగా, క్లిష్టమైన పదాలను తగ్గించి కవులు, కవయిత్రులు కవిత్వం రాశారు.

# మలిదశ తెలంగాణం ఈ కవనం



డాక్టర్ జీడి రమేశ్
96527 56516

స్థానిక పదాలకు, నినాదాలకు అధికమైన ప్రాధాన్యం ఇస్తూనే ఆగ్రహం, నిరసన చైతన్యం, వ్యంగ్యం ఉద్యమ పిలుపు, సామాజిక, సాంస్కృతిక అవగాహన కలిగించే శబ్ద తత్వం ఈ మలిదశ ఉద్యమ కవిత్వంలో వెలుగుచూసింది. ఈ సందర్భంలో తెలంగాణలో ఏ పల్లెను మందలించిన ఓ మాటై, పాటై, కథై, కవితై వెల్లువెత్తింది.

'ఇక్కడ పోరాటం మాత్రమే వారసత్వంగా వస్తున్న ఆస్తి' – అన్న పసునూరి రవీందర్ (లడాయి, పుట. 22) మాటలు నిజం చేస్తూ ఈ పోకడ కొత్తగా కలం పట్టిన కవుల కలాలకు సానబెట్టింది. మేటి కవుల కలాల్ని మరింత పదునుపెట్టింది. ఈ కొత్త పాతల కలయికను ఈ దశలోనే అధికంగా చూస్తాం. ఈ కాలంలో ప్రతి జిల్లా, పట్టణ, పల్లె ప్రాంతాల నుంచి ప్రచురించబడిన కవిత సంకలనాలే దీనికి తార్కాణం. ఈ దశలోనే మునుపెన్నడూ చూడని కొత్త నెత్తురు పురుడు పోసుకొని వెచ్చని వాసనతో కవిత్వాన్ని విస్తృతంగా ఎగజల్లింది. తెలంగాణ తన సాంస్కృతిక వారసత్వాన్ని, పోరాటతత్వాన్ని కొత్తగా నిర్మించుకున్న పద్ధతిని ఇది ఆవిష్కరించింది.

ఈ మలిదశ ఉద్యమ కవిత్వం 'శిరసు' కవుల ఆత్మస్వరూపం (Soul-form) 'నల్లవలస' నుంచి మొదలై అసంఖ్యాకమైన ఉద్యమ కవిత్వానికి జీవం పోసింది. ఈ 'నల్లవలస' వేల మెదళ్లను తట్టిలేపింది. కొత్త నినాదాలతో ఏరులై పారింది. దీని తర్వాత దాదాపుగా 130 పై చిలుకు కవుల కవితలతో జూలూరి గౌరీశంకర్ సంపాదకత్వంలో తెచ్చిన 'పొక్కిలి' తెలంగాణ సాహిత్యంలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. ఇట్లా సుంకిరెడ్డి నారాయణరెడ్డి సంపాదకత్వంలో 'మత్తడి', వేముగంటి మురళీకృష్ణ (సం) 'మునుం', సుంకర రమేశ్ 'తెలంగాణ కవిత', అనిశెట్టి రజిత (సం) 'జిగర్', క్విట్ తెలంగాణ, సుంకిరెడ్డి 'దాలి', అల్లం నారాయణ 'యాది-మనాది', నందిని సిధారెడ్డి 'ఇక్కడి చెట్ల గాలి', 'నది పుట్టువడి', అందెశ్రీ 'నిప్పుల వాగు', అన్నవరం దేవేందర్ (సం) 'వల్లుబండ', 'తొవ్వ', తెరవే 'గాయి', ఎనిశెట్టి శంకర్ 'సోయి', వంగా గాలిరెడ్డి 'కదం కదం', డప్పోల్ల రమేష్ 'మెతుకు సీమ', దాసోజు జ్ఞానేశ్వర్ 'రణగీతం', వెంకట్ 'వర్జి', గ్యార యాదయ్య 'ఎర్కోషి', కాసుల ప్రతాపరెడ్డి 'గుక్క', బూర్ల వెంకటేశ్వర్లు 'వాకిలి', కందుకూరి శ్రీరాములు 'తెలంగాణ రథం', వరంగల్ రచయితలు సంఘం 'ధోఖాంధ్రప్రదేశ్', నలిమెల భాస్కర్ 'ఉడాన్' (తె.కవిత్వం హిందీలోకి అనువాదం) మొదలైన కవిత్వం చూడవచ్చు. ఈ ఉద్యమ దశలో భాష ప్రధానమైన భూమిక పోషించింది. అత్యధికంగా తెలంగాణ తెలుగు పదాలు జీవం పోసుకొని కండ్లముందు కదులుతాయి.

సామాజిక, సాసంస్కృతిక పునాది గల తెలంగాణలో అత్యధిక సాహితీ సృజన మలిదశ ఉద్యమంలో జరిగిందంటే అతిశయోక్తి కాదు. ప్రపంచంలో మరేయితర ఉద్యమంలో భాగంగా వచ్చిన సాహిత్యాన్ని ఇంతగా చూడలేము. భవిష్యత్తు పరిశోధకులు ఈ ఉద్యమ సాహిత్యాన్ని నిగ్గుతేల్చాలి.

---

## నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం



## 'తెలంగాణ పతాకమైనోడు'

ఆ బక్క పలుచ మనిషి
తెలంగాణ మట్టిని గుండెకు హత్తుకున్నడు
నీళ్ల దోపిడి, నియామకాల దోపిడి, నిధుల
దోపిడిలతో తెలంగాణ తల్లిని చెరబడితే
తెలంగాణ బిడ్డల దుఃఖము ఉప్పెనై పొంగి
కన్నీళ్లై పారి, ఆకలి కేకలై రోదిస్తుంటే అన్నింటి తన
నర నరాలలో పారుతున్న ఎర్రటి రక్తంలో
కలుపుకొని సలసల మరిగిండు
జై తెలంగాణ నినాదమై జన సంద్రము
గుండెల్లో పొలికేక పెట్టిండు
ఊసిళ్ల పుట్ట అయి ఉద్యమం
తాగిండు చిన్న పెద్ద ముసలి
ముతక అడుగులై కదిలిండు
వలసవాద దోపిడికి
అడ్డుకట్టై నిలిచిండు

తెలంగాణ జెండా
అయి జూన్ 2న రెపరెపలాడిండు
తెలంగాణ ప్రజల ఆశలనవ్వై మెరిసిండు
అభివృద్ధి రథసారథిగా కదిలిండు
తెలంగాణను సస్యశ్యామలం చేసిండు
తెలంగాణ అయి వెలిగిండు
తను ఒక జీవ జలం
జనుల అంతరంగ గళం



గుండెల్లి ఇస్తారి
98499 83874

## విముక్తి రాగమై!


మా నీళ్లు మా నిధులు మా
కొలువులు మాకే దక్కాలంటు
అరవై ఏండ్ల మా కల నిజం కావాలంటు
విముక్తి రాగాలను ఆలపిస్తూ..

కొట్లాడి సాధించిన ఈ తెలంగాణ
కోట్లాది ప్రజలున్న నా తెలంగాణ
అమరవీరులను గన్న ఈ తెలంగాణ
ఆకుపచ్చని ఆకాంక్షల నా తెలంగాణ

సంస్కృతీ సంపదా విరిసింది ఇక్కడ
సహనమూ సమరమూ కలిసుండు ఇక్కడ
కవి గాయక హృదయాలు ఉప్పొంగునీనేల
కమనీయ కావ్యాలు ఒలికేటిదీనేల
యాసభాషల తెలుగు పలికేటి చోటు
ఉద్యమాలు ఊపిరిగ ఉరికేటి ఈ చోటు

కాకతి రుద్రమ్మ నడయాడిన ఈ నేల
కాళోజీ ధిక్కార ధార పారిన నేల
సమ్మక్క సారక్క తిరగాడిన ఈ చోటు
చిట్యాల ఐలమ్మ గళమెత్తిన చోటు
పసిడి నవ్వుల తంగేళ్ళు పూసేటి నేల
పాలపిట్ట పరుగుల్లు తీసేటి ఈ నేల

మన ఆశ మన శ్వాస మరవద్దు మనమంత!
మమత సమత మనదంటు సాగుదాము మనమంత!
ఆశయాల బాటలో నడుద్దాము మనమంత
ఆత్మగౌరవం తోటి బతుకుదాము మనమంతా!



- డాక్టర్ కొమర్రాజు రామలక్ష్మి, 98492 34725

---

## త్యాగ పరిమళం

అమ్మ
చేత ఇత్తనం పట్టుకుంది.
నాయిన
నాగలికి బొట్టు పెట్టిండు.

తుమ్మ సెట్టు మీద
పాలపిట్ట
సెలిమె అద్దంలో
తన రూపు చూసుకుంటుంది.

మంద గుడిసె మీద
గండు కోయిలలు
పోరు పాటలు వినిపిస్తున్నవి.

పుస్తకాలలోన
అచ్చరాలన్నీ
సకల జనుల సమ్మెకు
మద్దతు గట్టినయి

ఎత్తిన
బోనం దించకుండా
నల్ల పోశమ్మ నడూర్ల దీపం
పెట్టింది.

పొల్మెర కాడ
గుండె డప్పు కొట్టుకుంట
కోటేశు కావడి కుండలు కట్టిండు.

ఇంటి ముందలి
జిల్లేడు సెట్టు
యిడుపు కాయితం రాసుకున్నయి

సోమిగాని గోశిగుడ్డ
అయ్యగారి పంచెకట్టు దూప తీర్చింది


తెలంగాణి శిగకొప్పున
బతుకమ్మ కొలువుదీరింది


అరవై ఏండ్ల
ముసలి తాత
ఈర తిలకం దిద్దుకున్నడు

తొవ్వపొంటి మోదుగు పూలు
త్యాగాలనే పరిమళిస్తున్నయి



చిక్కొండ్ర రవి
95023 78992







## ధర్మక్షేత్రం

పునరుజ్జీవన పోరుబాట
తెరిచిన తలవంపులు తలుపులు
వెలుగు లీను తెలంగాణం

వ్యథలపాలై శోకించిన వైనం
ఒడవని కారుచీకట్ల ఇక్కట్లు
ఎక్కిన మెట్లెన్నోచరిత్రలో నిక్షిప్తం

విస్ఫోటనంలా రగిలించిన
ఉద్యమ స్ఫూర్తి
అనతికాలంలో సాధించిన
నవనవోన్మేష ప్రగతి ప్రభంజనం
సాక్షాత్కరించిన రాష్ట్ర
అభ్యుదయ అవతరణం

కబోదుల పాలై మసక చీకట్లో విలవిల
అన్నం పెట్టే అమ్మ అన్నపూర్ణ తెలంగాణ
రైతన్నల ఆత్మాహుతికి బలైన
దీనావన భిక్షాటనలో
తలవంపుల పరిపాలన
కపట కుతంత్రాల్లో బలైన జనజీవనం
అధికార పీఠమెక్కించే రాజకీయం.
ప్రగతి రథ చక్రాల కాలరాచే మంత్రాంగం
ప్రగతి దారుల్లో మొలిచిన ముళ్ళపొదలు
చెదలు తొలిచిన పత్రహరిత మాగాణం

కత్తుల జిత్తుల కపట
పద్మవ్యూహాలు
వ్యవస్థలన్నీ అవస్థల పాలైన
కల్లోల రాజకీయ దవానలం
విద్వేష విషాలమయమైన
కురుక్షేత్రం
నా తెలంగాణ..
పథనిర్దేశ మార్గదర్శకమయ్యే
ధర్మక్షేత్రం



కె.లక్ష్మణ్ గౌడ్
97049 30509

---

## చరిత్ర వీరులు

ఉద్యమం ఊపిరి పోసింది
సత్తువ సమరం
ఈ నేల వీరుల త్యాగం

మలిదశ ఉద్యమం
మనిషి మనిషి హృదయాల కదలిక స్మృతి
తరతరాలకు చరిత్ర తనువు తుడచలేనిది

ఊరురా ఉద్యమ చరిత్ర
పల్లె పల్లెల పాతిన నిలువు రాయి
జన హృదయాలలో ఎగరవేసిన
జగతిలో సమరం

మానవ సమాజం
మతి ఉన్నంతవరకు
మది మదిలో మెదిలే మానవ జీవం

సావుకైనా సిద్ధపడి సాధించిన తెలంగాణ
తలవంచని బిడ్డలు తల్లి తెలంగాణ పుత్రులు
అమరులు సమరయోధులు
అవనిలో అంతం లేని చరిత్ర వీరులు



దేవరపాగ కృష్ణయ్య
99634 49579

## తెచ్చుకొంటిమయ్యా తెలగాణ

తొలిదశోద్యమంబు వెలిసిబోయినమీద
పురుడు పోసుకొనెను పోరుబాట
మరల దేశమందు మనయునికిని చాట
ముప్పదేండ్ల కృషికి మూలమనగ

పదియునాలుగేళ్ళు ప్రజల మనసులందు
చెరిగి పోని ముద్ర చేరవేసి
తెచ్చుకొంటిమయ్య తెలగాన మన భూమి
పాట మాట పనుల పదును బెట్టి

పదివర్షంబుల పాలన
మది దోచునటుల జరిగెను మనకభి వృద్ధిన్
పదిలముగాజేసి నిలిపె
కుదురుగ జనులందరికిని కూర్చెను శుభముల్

నిధులు కొలువులింక నీళ్ళకొరకనుచు
జరిగినట్టి పోరు వరములిడగ
మనదు భాగ్యమంత మనవైపు తిరుగగ
గంతులేసినాము సంతసమున

లోపమేమొకాని శాపమయ్యెను మనకు
మార్పు పాలనందు మంచి లేక
మరల మనల మనమె పరిపాలనము జేయు
దారి చూసినపుడె ధన్యతగును



చిలకమర్రి కృష్ణమాచార్యులు
99855 13883

## వీరులు

వలస పాలన దుర్నీతి వాంఛ నెరగి
కలసికట్టుగా నెదిరించి కండ బలము
చూపె తెలగాణ; వీరుల చూపులందు
సూర్య కిరణాలు నిండగా చురుకు బెట్టి.

నాల్గు దిక్కులు వ్యాపించినారు రిపులు
శిరము వంచగా పరిగెత్తి చితక గొట్టి
తల్లి ఋణమును తీర్చెడి తనయు లంత
వీర వీరులు తెలగాణ పౌరులెల్ల.



ప్రాణముల త్యాగమొనరించి రణము నందు
ఆస్తి పాస్తులు పోయిన ఆంక్ష కొరకు
పట్టు విడువక పయనించి పాటు పడిరి
యిట్టి పుత్రుల యమ్మవే యీవు తల్లి!

- జాధవ్ పుండలిక్ రావు పాటిల్
94413 33315

---





అశోక్ గోనె
94413 17361

## త్యాగాల నిలయం.. తెలంగాణం

నింగిపందిరై తెలంగాణ నేలను చూస్తుంది.
సేనులో సేద్యకాడు నిండు సందమామై మెరుస్తుండు.
అతడి సేతిలో పడ్డ అవని అంతా
పచ్చనిసీర ఆరేసినట్టు కనిపిస్తుంది.
ధరణిపై కాళేశ్వరం ఆకాశంలోని తెల్లని మేఘాల్లా.
సెరువు మత్తడులు.. జలపాతాల సవ్వడులు.
వడ్లరాసుల కుప్పలు.. తెల్ల బంగారం రాసులు.
అభివృద్ధి సంక్షేమం జోడెడ్ల బండ్లు.
అరవై ఏండ్ల కల నిజమైన దినం.
మళ్లీ కల కలలాగే కలల నీడలోకి వెళ్లింది.

పాలపొంగుల్లా పొంగిన నీటిధారలు ఎక్కడని
అవని అడుగుతుంది.
సేద్యంలో సేద్యకాడి చిరునవ్వు చిరునామా ఎక్కడని
సేను సెలక సిన్నబోయి చూస్తున్నయి
జింకపిల్లలా గెంతులువేస్తూ ఎగిరిన అభివృద్ధిని
ఏ పెద్దపులి ఎత్తుకపోయింది.?
ఆడబిడ్డల ఆసరా ఏమైంది.?
కన్నీరు తుడిచే కల్యాణలక్ష్మి
కన్నీరెందుకు కారుస్తుంది?
రైతుబంధు ఎందుకు అందని బంధువైంది
కాలం ప్రశ్నల వర్షాన్ని కురిపిస్తున్నది.

అమరుల గుర్తుకు నిదర్శనం. ఈ తెలంగాణం.
త్యాగాల పుట్టిల్లు ఈ తెలంగాణం.
మరో ఉద్యమానికి వెనుకాడదు ఈ తెలంగాణం.

## అజరామర స్వప్నం

బొక్కలు ఫ్లోరోసిస్ చెదలు వట్టి
గుండెలవిసిపోతున్న గొంతుల్ల
ఎక్కిళ్ళువడుతున్న కన్నీటి పొరలు
కరువు కాకిశోకపు వలస నేల మీద
మలిదశ మాయిముంతల
అమరుల త్యాగాల కలలన్నీ
ఫీనిక్స్ పక్షికి నిప్పుల ఊపిరులూదిన యాళ్ల
పుట్టిందొక పెనుమంటల పొలికేక

నెర్రెలిడిసిన అరిగోసల బతుకులు
చెట్టుకోలు పుట్టకోలు వొడిసెల రాళ్లై
తనువును పొక్కిలి చేసుకొని
ఎదురొమ్మును చీల్చుకొని సకల ఉద్యమాల
లావాను గొంతు పాళీల్లో దట్టించుకొని
సబ్బండ మానవ సమూహాలు
పల్లె పిడికిల్ల పొలిమేరలై నినదించి
పార్లమెంటుల భూకంపం పుట్టించిన యాళ్ల

పొత్తిళ్ల నెత్తుటి గుడ్డయి నినదించిన
అరవయ్యేండ్ల అజరామర స్వప్నం
జై తెలంగాణ!!



విశ్వనాథుల పుష్పగిరి
96664 35426

## పురస్కారాల ప్రదానం

**2025,** జూన్ 7వ తేదీ శనివారం రోజున సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్, రవీంద్రభారతిలో శీలావీ సాహిత్య, చిత్రకళా పురస్కారాలు అందజేయనున్నారు. 2025కి గాను 'గారడివాడు' కథా సంపుటి రాసిన కె.ఎ.మునిసురేష్ పిళ్లైకి శీలా వీర్రాజు కథానిక పురస్కారం, ప్రముఖ చిత్రకారుడు పీఎస్ చారికి శీలా వీర్రాజు చిత్రకళా పురస్కారం రూ.15 వేల నగదు, జ్ఞాపికతో సత్కారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి శ్రీయుతులు విహారి, మామిడి హరికృష్ణ, ఇంద్రగంటి మోహనకృష్ణ, డాక్టర్ అమృతలత, ఎంవీ రామిరెడ్డి పాల్గొంటారు. ఈ సందర్భంగా శీలావీ చిత్రలేఖనాలపై వ్యాససంకలనం 'ఒక చిత్రకారుడు-అనేక అవలోకనాలు', శీలా వీర్రాజు ఫాంట్‌తో 250 మంది కవుల కవితా సంకలనం 'శీలాక్షరాలు' ఆవిష్కరించనున్నారు. అందరికీ ఆహ్వానం.

- శీలా సుభద్రాదేవి, శీలావీ సాహిత్య చిత్రకళా వేదిక

